# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

- ఎంఈఓ సలీంషరీఫ్


విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోదాడ రూరల్, మే 11: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తుండడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మండల విద్యాధికారి ఎండీ. సలీంషరీఫ్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోదాడ జడ్పీహెచ్ఎస్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి ఫలితాల్లో కోదాడ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని తాళ్లూరి రేఖాశ్రీ 571 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించగా, కె.నరేందర్ 549 మార్కులతో సత్తా చాటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ, ఆర్ఐ జానకిరాంరెడ్డి, చెరుకు అశోక్, ఖాజాభాయ్, పంది తిరుపతయ్య, టి.శ్రీనివాస్, కర్ల కాంతారావు, గంధం ఫణికుమార్, తాటి మురళి, పంది కల్యాణ్, కిరణ్ పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరేడుచర్ల, మే 11: పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి నగదు, వెండి, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. బాధితుడు మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్ భార్య కౌసర్ అంజుమ్ మిర్యాలగూడలోని తన తల్లిగారి ఇంటికి నాలుగు రోజుల క్రితం వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి ఇస్మాయిల్ కూడా మిర్యాలగూడ వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని రూ.15 వేల నగదు, 10 తులాల వెండి, 4 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## మోదీ పాలనలో పేదల బతుకులు ఆగం

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్, మే 11: దేశంలో మోదీ పాలనలో పేదల బతుకులు ఆగమయ్యాయని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతుల ప్రయోజనాలను పట్టించుకోకుండా పెట్టుబడిదారులను కాపాడే పనిలో ఉందని విమర్శించారు. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ధరలను నియంత్రించకుండా, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేయకుండా, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా బీజేపీ పాలన ఉందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న వివిధ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, పాండు, వట్టేపు సైదులు, శ్రీను, బాలునాయక్, వెంకటరెడ్డి, మురళి, సైదులు, సోమయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## అమర జవాన్లకు నివాళి


శ్రీనివాస్ నగర్ తండాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

మునగాల, మే 11: ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ ఆవాసమైన శ్రీనివాస్ నగర్ తండాలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాణోతు సురేశ్ బాబు, పవన్‌నాయక్, మాలునాయక్, గోపినాయక్, చరణ్‌నాయక్, గుణశేఖర్, నితిన్‌నాయక్, దేవేందర్‌నాయక్, లిఖిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు సన్మానం


ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను సన్మానిస్తున్న నెమ్మికల్ గ్రామస్తులు

ఆత్మకూర్.ఎస్, మే 11: తనను ఉన్నత పదవిలో చూడాలని 11 ఏండ్లుగా ఎందరో అభిమానులు ఎదురు చూశారని, వారి దీవెనలతోనే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌కు మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన స్వగ్రామమైన మండలంలోని నెమ్మికల్ గ్రామంలో ఆదివారం పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ తాను పుట్టిన ఊరిలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంపల కృపాకర్, గంపల నారాయణ, జానకిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీరస్వామి

సూర్యాపేట టౌన్, మే 11: రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను సిబిల్ స్కోర్ ఆధారంగానే ఎంపిక చేస్తామని ప్రభుత్వం నిర్ణయించడాన్ని తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంతంగి వీరస్వామి గౌడ్ ఖండించారు. జిల్లా కేంద్రం సూర్యాపేటలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబిల్ స్కోర్ నిబంధనల వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు లేని ఎంతోమంది నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో వారి ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో నిరుపేద, మధ్య తరగతి యువతకు ఒక్కరికి కూడా పథకం అందే అవకాశం లేదన్నారు. సమావేశంలో జలగం సత్యంగౌడ్, దేవత్ కిషన్‌నాయక్, వెన్న శ్రీనివాస్‌రెడ్డి, పాల సైదులు, అయితగోని మల్లయ్య, ఖమ్మంపాటి అంజయ్య, ఆకుల మారయ్య, మాదిరెడ్డి గోపాల్‌రెడ్డి, పి.కిరణ్, లింగారెడ్డి, సారగండ్ల కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారంలో సైన్స్ కీలక పాత్ర'

కోదాడ రూరల్, మే 11: మానవ జీవితంలో అనేక సమస్యలకు సైన్స్ పరిష్కారం చూపుతుందని, మానవ మనుగడలో సైన్స్‌ది కీలక పాత్ర అని ప్రముఖ న్యాయవాది మేకల వెంకట్రావ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో రైజింగ్ తెలంగాణ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైన్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు న్యాయం, చట్టం, హక్కులు, విధులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్, ఎస్‌కే.జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- అభివృద్ధికి నోచుకోని వైనం
- క్రీడాకారులకు అందని కిట్లు
- వినియోగంలోకి తీసుకురావాలని విన్నపం



దిర్శించర్లలోని క్రీడా ప్రాంగణంలో రాళ్లకుప్పలు

నేరేడుచర్ల, మే 11: క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. సరైన వసతులు కల్పించకపోవడంతో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు సరఫరా చేసిన క్రీడా సామగ్రి గ్రామ పంచాయతీ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. మరి కొన్ని చోట్ల క్రీడా సామగ్రి కిట్లే లేకుండా మాయమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో క్రీడలపైన మక్కువ ఉన్న యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

### మున్సిపాలిటీలు, గ్రామాల్లో..

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు 2022 జూన్ 2న ప్రతి గ్రామం, పట్టణాల్లో అనువైన స్థలాలు గుర్తించగా.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్థల లభ్యత, జనాభా ఆధారంగా రెండు నుంచి మూడు ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ ఆడేలా క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేశారు. యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. తెలంగాణ క్రీడా శాఖ ద్వారా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటిని నిత్యం పరిశీలించిన అధికారులు ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 475 గ్రామ పంచాయతీలు, 204 ఆవాస గ్రామాలు ఉన్నాయి. మొత్తం 679 గ్రామ పంచాయతీలతో పాటు 5 మున్సిపాలిటీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. రూ. 2.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కిట్‌కు రూ.63 వేలు చొప్పున వెచ్చించి మొత్తం 698 స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్ బ్యాట్, గ్లౌజులు, లెగ్ ప్యాడ్లు, వికెట్లు, బాల్స్, వాలీబాల్‌కు సంబంధించిన సింథటిక్ బాల్స్, సైకిల్ పంపు, కొలతల టేప్, డిస్కస్ త్రో, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ తాళ్లు, విజిల్స్, స్టాప్‌వాచ్‌లు ఉంటాయి. అదే విధంగా క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ కిట్లు కేవలం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే పడి ఉన్నాయి. వేసవి సెలవుల్లో శిక్షణ పొందుదామని భావించిన వారికి నిరాశే ఎదురవుతోంది.


చిల్లేపల్లి క్రీడా ప్రాంగణంలో ఉంటున్న బాతుల పెంపకందారులు (ఫైల్)

### అస్తవ్యస్తంగా..

గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడా సరిగా వినియోగంలో లేవు. నేరేడుచర్ల మండలం దిర్శించర్లలోని క్రీడా ప్రాంగణం మొత్తం రాళ్ల కుప్పలతో నింపేశారు. చిల్లేపల్లిలో ఏకంగా బాతులు పెంచుకునేవారు గుడారం వేసుకొని రాత్రి సమయంలో వాటిని క్రీడా మైదానంలో ఉంచుతున్నారు. చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎప్‌సెట్ ఫలితాల్లో విజయ కేతనం


ఉజ్వన్


తేజశ్రీ


హన్షితశ్రీ

సూర్యాపేట అర్బన్, మే 11: తెలంగాణ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాల్లో జిల్లా కేంద్రం సూర్యాపేటలోని జయ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు కన్నా ఉజ్వన్ 141వ ర్యాంక్, తేజశ్రీ 266వ ర్యాంక్, హన్షిత శ్రీ 695వ ర్యాంక్ సాధించారని చెప్పారు. అదేవిధంగా 1000 ర్యాంకుల లోపు ఐదుగురు విద్యార్థులు, 5 వేల లోపు 11 మంది, 10 వేల లోపు 24 మంది, 25 వేల లోపు 53 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

## 'అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి'


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సూర్యాపేట టౌన్, మే 11: అనుమతులు, అర్హతలు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ డిమాండ్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలంను సస్పెండ్ చేయాలని అన్నారు. 'పేద ప్రజల ఆరోగ్యం-నకిలీ డాక్టర్లు-ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు తనిఖీలు నిర్వహించి సూర్యాపేట పట్టణంలోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు చట్టాలను ఉల్లంఘిస్తూ నడుస్తున్నాయని ప్రకటించినా జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ నెల 2న అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 3న డీఎంహెచ్ఓ అర్హతలు లేని ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారం రోజుల్లో సరైన ధ్రువపత్రాలు చూపకుంటే సీజ్ చేస్తామని ప్రకటించి వారం గడుస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. తక్షణమే డీఎంహెచ్ఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లింగయ్య, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి నరేశ్, బాషిపంగు సునీల్, పోరెళ్ల విప్లవకుమార్, అశోక్, కరీం, గట్ల రమాశంకర్, బంటు సందీప్, దారావత్ వెంకటేశ్‌నాయక్, ఎనిగ సంతోశ్‌రెడ్డి, దారావత్ నాగేశ్వర్‌నాయక్, చామకూర మహేందర్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలి'

మేళ్లచెర్వు, మే 11: తెలంగాణ విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రం మేళ్లచెర్వు, మండలంలోని రామాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కాకుమాను వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ క్యాంపులో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, క్రీడలు, సాంస్కృతిక అంశాలు, స్పోకెన్ ఇంగ్లిష్, గణిత పజిల్స్, సైన్స్ ప్రయోగాల వంటి అంశాలపై వలంటీర్లు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## ఉచిత వైద్య శిబిరం


మేళ్లచెర్వు, మే 11: మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మం సహస్ర హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జనార్దన్‌రావు, వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

నూతనకల్, మే 11: రైతాంగం, ప్రజా సమస్యల పరిష్కారానికి, ఉపాధి హామీ పథకం రక్షణ కోసం ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేణు, నర్సయ్య, అవిలయ్య, నాగలింగం, రాజయ్య, సూరయ్య, నాగన్న పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తుంగతుర్తి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


కోదాడ రూరల్: రామాపురం పాఠశాల పూర్వ విద్యార్థులు


పాలకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి, మే 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989-1990 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఎన్నో ఏండ్ల తర్వాత ఒక్క చోట కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు మల్లె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు బీమిరెడ్డి వెంకట్‌రెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, అంతయ్య, ఆకారపు రామయ్య, ప్రస్తుత ఇన్‌చార్జి హెచ్ఎం గుజ్జ భాస్కర్, మాజీ ఎంపీపీ గుండగాని కవితారాములు, పి.గణేశ్, జి.రాములుగౌడ్, పి.వెంకటేశ్వర్లు, బి.శ్యాంసుందర్, శ్రీనివాస్, రవీంద్రాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మేళ్లచెర్వు మండలం రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శివారులో గల రామాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

పాలకవీడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు జనార్దన్, మునావర్ బేగం, సుధాకర్, నిర్మల, పూర్వ విద్యార్థులు ప్రభాకర్, హనుమ, ఉపేంద్రాచారి, శ్రీను, కృష్ణనాయక్, సతీశ్, శ్రీను, నాగరాజు, నాగమణి, జనని, సుజాత, మానస పాల్గొన్నారు.

# కంకర తేలి.. గుంతలమయంగా మారి..

- అధ్వానంగా తాటిపాముల రోడ్డు
- మరమ్మతులు చేయాలని ప్రజల వేడుకోలు


గుంతలతో అధ్వానంగా మారిన తిరుమలగిరి నుంచి తాటిపాముల గ్రామానికి వెళ్లే రోడ్డు

తిరుమలగిరి, మే 11: తిరుమలగిరి మున్సిపాలిటీ నుంచి తాటిపాముల గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందాపురం, తాటిపాముల నుంచి తిరుమలగిరి మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రజలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే, సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా కంకర తేలి, గుంతలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు పెద్ద సంఖ్యలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక వర్షాలు పడితే జనగామ జిల్లా మొండ్రాయి గ్రామం మీదుగా సుమారు 15 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## టాటా ఏస్ వాహనం బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


వాహనం బోల్తాపడడంతో రోడ్డుపై పడిన నూనె డబ్బాలు

తిరుమలగిరి, మే 11: నూనె డబ్బాలతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం బోల్తాపడిన ఘటన మండల పరిధిలోని మామిడాల గ్రామ స్టేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం మామిడాల స్టేజీ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## అదుపుతప్పి ఇటుక బట్టీల్లోకి దూసుకెళ్లిన కారు


ప్రమాదానికి గురైన కారు

హుజూర్‌నగర్ రూరల్, మే 11: కారు అదుపుతప్పి ఇటుక బట్టీల్లోకి దూసుకెళ్లిన ఘటన హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పల్లేటి సుందర్ అనే వ్యక్తి కారులో మిర్యాలగూడలో బంధువుల వివాహానికి బయలుదేరాడు. గోపాలపురంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలోకి ద్విచక్ర వాహనం అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయి కారు అదుపుతప్పి సమీపంలోని ఇటుక బట్టీలను ఢీకొట్టింది. కారులోని సేఫ్టీ ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదు. కారులో ఉన్న పల్లేటి రాములమ్మకు వెన్నుముక, కాలుకు గాయాలు కావడంతో సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## 'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'


కొత్తగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ ఎడ్యుకేటర్ భవాని


తుంగతుర్తి, మే 11: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని కమ్యూనిటీ ఎడ్యుకేటర్ భవాని సూచించారు. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ (మిషన్ పరివర్తన్) కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్తులు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తుతో జీవితాలు చిత్తవుతాయని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

## 'షరతులు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, మే 11: షరతులు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇండ్ల మంజూరుకు అనేక కొర్రీలు పెడుతుందని విమర్శించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల మేర ఇంటి నిర్మాణం చేపట్టాలని, అంతకుమించి స్థలం ఉంటే ఇండ్లకు అనర్హులు అనడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న, యువజన నాయకుడు కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## 'కార్మికులకు శాపంగా మారనున్న లేబర్ కోడ్‌లు'



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుజూర్‌నగర్, మే 11: భవన నిర్మాణ రంగ కార్మికులకు 4 లేబర్ కోడ్‌లు శాపంగా మారనున్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యలక సోమయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన శిల్పకళ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని, మే 20న జరుగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగుల్‌మీరా, మల్లేశ్, నాగేంద్ర, శ్రీను, సతీశ్, రవి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా 'రాజీవ్ యువ వికాసం' అమలు చేయాలి

నూతనకల్, మే 11: ఆంక్షలు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉప్పుల వీరుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి పథకాలను గతంలో మాదిరిగా అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులను కుదించడానికి సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే అమలు చేయమని కొర్రీలు పెడుతుందని ఆరోపించారు. 50 శాతం మంది దరఖాస్తుదారులకు పాన్‌కార్డు లేదని తెలిపారు. సమావేశంలో మహేశ్, వెంకన్న, రమేశ్, నగేశ్, సురేందర్, వెంకట్, నారాయణ, మధు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.